క్లుప్తంగా

ఐపీఎస్ ప్రాథమిక అంశాలు పుస్తకాలు ఆవిష్కరణ



విస్సన్నపేట: ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు రచించిన ఐపీఎస్ ప్రాథమిక అంశాలు పుస్తకాలను ఎంపీడీఓ చేకు చినరాట్నాలు చేతుల మీదుగా గురువారం ఆవిష్కరించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సీహెచ్ సూర్యనారాయణ మాట్లాడుతూ మండలంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు ఈ పుస్తకాలను పంపిణీ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ చంటిబాబు, ఎ. మురళీకృష్ణ, నాయకులు రంగా, నాగేశ్వరరావు, రాజశేఖర్, రాంబాబు, లక్ష్మణ, బీవీ రామారావు పాల్గొన్నారు.

శాఖా గ్రంథాలయం తనిఖీ



మైలవరం: మైలవరం శాఖా గ్రంథాలయాన్ని కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి. రవికుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రంథాలయ రికార్డులను పరిశీలించారు. పాఠకుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయ పనితీరుపై సంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాభివృద్ధి కమిటీ అధ్యక్షురాలు కోయ సుధ, గ్రంథాలయ సిబ్బంది సయ్యద్ అహ్మద్, రాంబాబు, రాజేంద్రప్రసాద్, పాఠకులు పాల్గొన్నారు.

లక్ష తమలపాకులతో అర్చన



మేడూరు(గంపలగూడెం): మేడూరు శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో గురువారం స్వామి వారికి లక్ష తమలపాకులతో విశేష అర్చన చేశారు. సప్తాహాల్లో భాగంగా నాలుగో రోజు విఘ్నేశ్వర పూజతో ఆలయ అర్చకులు కోమందూరు ఆంజనేయచార్యులు ప్రత్యేక కార్యక్రమాలను ప్రారంభించారు. బుధవారం రాత్రి ఆంజనేయస్వామి పడిపూజ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం హనుమత్ వ్రతాలు నిర్వహిస్తామని మేనేజర్ ప్రసాద్ తెలిపారు.

కార్నియాల సేకరణ



గార్లపాటి సుబ్బారావు

గంపలగూడెం: గంపలగూడెంకు చెందిన ఆర్య వైశ్యుడు గార్లపాటి సుబ్బారావు (80) గురువారం మృతి చెందారు. ఆయన కంటి చూపు సక్రమంగా ఉండటంతో నేత్రదాన ఆవశ్యకతను లయన్స్ క్లబ్ సభ్యుడు గోగిరెడ్డి కృష్ణారెడ్డి మృతుని కుటుంబ సభ్యులకు వివరించారు. వారు అంగీకరించడంతో ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి సమాచారం అందించారు. వైద్యులు వచ్చి మృతుడి కార్నియాలు సేకరించారు.

సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బందికి శిక్షణ



చాట్రాయి: గ్రామాల అభివృద్ధి పరిచే 9 లక్ష్యాలను సాధించేందుకు అధికారులు కృషి చేయాలని ఎంపీడీఓ విజయలక్ష్మి అన్నారు. గ్రామాల అభివృద్ధి లక్ష్యాల సాధనపై సచివాలయ సిబ్బంది, సర్పంచ్‌లకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు శ్రీనివాసరెడ్డి, వ్యవసాయాధికారి బి. శివశంకర్, ఏపీఓ విజయలక్ష్మి, శిక్షకులు హనుమంతరావు, కాశీవిశ్వనాథ్, పార్థసారథి, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షునికి పుత్ర వియోగం



మూల్పూరి ధరణి (ఫైల్)

ముసునూరు: వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మూల్పూరి నాగవల్లేశ్వరరావుకు పుత్ర వియోగం కలిగింది. ఆయన పెద్ద కుమారుడు ధరణి (28) హైదరాబాద్‌లో గురువారం మృతి చెందారు. ధరణి హైదరాబాద్‌లో హోటల్ వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు ఆయన్ను హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ మృతిచెందారు. ధరణికి భార్య ఉన్నారు. ఆయన భౌతికకాయానికి శుక్రవారం నూజివీడులో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

ఇంటింటికీ కుళాయి కలేనా?

- గత ప్రభుత్వం రూ.127.68 కోట్లు మంజూరు
- కొండపల్లి మున్సిపాల్టీకి రూ.57.93 కోట్ల ప్రత్యేక నిధులు
- 2019లో రూ.186.91 కోట్లు మంజూరు

ఇబ్రహీంపట్నం: ఇంటింటికీ కుళాయి కనెక్షన్ పథకం కార్యరూపం దాల్చడం లేదు. వివిధ పేర్లతో గతంలో కాంగ్రెస్, టీడీపీ, వైఎస్సార్ సీపీ ప్రభుత్వాలు ఈ పథకానికి నిధులు మంజూరు చేసినప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో అటకెక్కిందనే ఆరోపణలు ఉన్నాయి. దశాబ్దాలు గడుస్తున్నా పథకం కార్యరూపం దాల్చకపోవడంతో మైలవరం నియోజకవర్గ ప్రజలకు ఫ్లోరైడ్ నీరే దిక్కయింది.

కొండపల్లి, ఇబ్రహీంపట్నం గ్రామాలకు ఇంటింటి కుళాయి పథకం పదేళ్లకు పైగా ప్రజలను ఊరిస్తోంది. 2013లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పురా పథకం (ప్రొవిజన్ ఆఫ్ అర్బన్ ఎమినిటీస్ ఇన్ రూరల్ ఏరియాస్) అప్పటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి, ఇతర మంత్రులు ఇబ్రహీంపట్నంలో ప్రారంభించి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ గ్రామాల అభివృద్ధికి రూ.189.4 కోట్లు కేటాయించారు. వీటిలో ఇంటింటి తాగునీటి కుళాయి పథకానికి రూ.56.50 కేటాయించారు. 2014లో టీడీపీ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారం చేపట్టడంతో పురా పథకాన్ని అటకెక్కింది. 2019లో ఎమ్మెల్యేగా గెలిచిన వసంత వెంకట కృష్ణ ప్రసాద్ పురా పథకం తిరిగి అమలు చేసేందుకు చేసిన కృషి ఫలించలేదు. రెండు గ్రామాల్లో సుమారు 65,385 మంది జనాభా, 20,184 కుటుంబాల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని 2023లో అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇంటింటికీ కుళాయి పథకం అమలుకు రూ.57.93 కోట్ల నిధులు మంజూరు చేసింది. పబ్లిక్ హెల్త్, మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖ ఉన్నతాధికారులు ఒక వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, రెండు ఎలివేషన్ స్టోరేజ్ రిజర్వాయర్లు, పైప్‌లైన్ ఏర్పాటుకు టెండర్లు పిలిచారు. ఈలోగా సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడంతో పనులు నిలిచిపోయాయి.

2019 ఎన్నికల ముందు అప్పటి జలవనరుల శాఖ మంత్రిగా ఉన్న దేవినేని ఉమా ఇంటింటికీ కుళాయి ఏర్పాటుకు రూ.186.91 కోట్లు నిధులు జలధార పథకం ద్వారా మంజూరు అయినట్లు హడావుడి చేశారు. కొండపల్లిలో ఏర్పాటు చేసిన శిలాఫలకం దిష్టిబొమ్మలా మారింది. 2023 జూలైలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఇంటింటి కుళాయి పథకం అమలుకు అవసరమైన రూ.127.68 కోట్ల నిధులు కేంద్ర జల్ జీవన్ మిషన్ ద్వారా మంజూరు చేశారు. ఐదు మండలాలతో పాటు కొండపల్లి మున్సిపాల్టీకి రూ.57.93 కోట్లు ప్రత్యేక నిధులు కేటాయించారు. ఇంటింటి కుళాయి పథకం సాకారమైతే 62 గ్రామాల ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందుతుంది.



మైలవరంలో వీధి కుళాయిల కోసం నిర్మించిన నీటి సంపు

జల్‌జీవన్ పథకంలో మంజూరైన నిధులు

మండలం	గ్రామాలు/ వార్డులు	నిధులు (రూ. కోట్లలో)
జి.కొండూరు	22	57.06
రెడ్డిగూడెం	12	14.51
మైలవరం	13	21.74
ఇబ్రహీంపట్నం	10	18.03
విజయవాడ రూరల్	5	16.34
కొండపల్లి మున్సిపాల్టీ	29	57.93

ఫ్లోరైడ్ తాగునీటితో అవస్థలు

జల్ జీవన్ మిషన్ పథకంలో మొదటి, రెండో దశ పనులకు నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో మైలవరం, రెడ్డిగూడెం, జి.కొండూరు, విజయవాడ రూరల్, ఇబ్రహీంపట్నం మండలాల పరిధిలోని 62 గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాల్సి ఉంది. అయితే పథకం ముందుకు సాగకపోవడంతో ఆయా గ్రామాల్లోని ప్రజలు తాగునీటి కోసం బోరు పంపులు, బావులపై ఆధారపడాల్సి వస్తోంది. బోరుపంపుల్లో ఫ్లోరైడ్ శాతం అధికంగా ఉన్న నీరు తాగుతూ అనారోగ్యం పాలవుతున్నారు.

అరకొరగా తాగునీటి సరఫరా

ఇబ్రహీంపట్నం గ్రామీణ రక్షిత నీటి సరఫరా పథకం ద్వారా కొన్ని మండలాలకు కృష్ణానది నీరు పైపుల ద్వారా అరకొరగా సరఫరా చేస్తున్నారు. ఆయా మండలాల్లో సంపులు ఏర్పాటు చేసి గ్రామాల్లో వీధికి ఒకటి, రెండు కుళాయిలు ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో పూర్తి స్థాయిలో నీటి నిల్వలకు సంపులు, ఓవర్ హెడ్ ట్యాంకులు, పైపులైన్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఏడాది కిందట అక్కడక్కడా ఏర్పాటు చేసిన సంపులు, ఓవర్ హెడ్ ట్యాంకులు, పైపులైన్లు నిరుపయోగంగా మారాయి.



అప్పటి టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిలాఫలకం

హామీలు నెరవేర్చాలి



ప్రతి ఇంటికి తాగునీటి కుళాయి ఇస్తామని పాలకులు ప్రగల్భాలు పలికారు. కాలయాపనతో ఏయేటికాయేడు గడిచిపోతోంది. హామీలిచ్చి పదేళ్లు దాటినా కుళాయి పథకం అమలు కావడంలేదు. కొన్ని గ్రామాల్లోని వీధుల్లో పైప్‌లైన్లు వేసి వీధి చివర్లలో కుళాయిలు ఏర్పాటు చేశారు. ఇంటింటికీ కుళాయి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.

– ఇంకొల్లు జమలయ్య, తోలుకోడు

ఎస్సీ కాలనీలో తాగునీటి ఎద్దడి



ఈలప్రోలు ఎస్సీ కాలనీలో తాగునీటి ఎద్దడి నెలకొంది. వీధుల్లో పైపుల ద్వారా వస్తున్న నీరు సరిపోవడం లేదు. ఇతర అవసరాలకు సమీపంలోని పోలవరం కాలువ నీటిపై ఆధారపడాల్సి వస్తోంది. ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేస్తామని చెబుతున్నారు తప్ప అమలు కావడంలేదు. అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

– కొర్లపాటి అశోక్, ఈలప్రోలు

ఉపాధి పనుల సామాజిక తనిఖీ

ఆంజనేయపురం(తిరువూరు): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గత ఏడాది నిర్వహించిన పనులపై గురువారం సామాజిక తనిఖీ జరిగింది. పంచాయతీ కార్యాలయంలో జరిగిన గ్రామ సభలో గత ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన ఉపాధి పనులకు అయిన ఖర్చులపై సోషల్ ఆడిటర్ లీలా కృష్ణ నివేదిక సమర్పించారు. కూలీలకు వేతనాల చెల్లింపులో జాప్యం, ముఖ్యమైన పనుల నిర్వహణకు ఉపాధి హామీ నిధులు మంజూరు కాకపోవడంపై పలువురు ప్రశ్నించారు. సర్పంచి మామిడి కుటుంబరావు అధ్యక్షతన ఈ సభ జరిగింది. ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి

జి.కొండూరు: ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని చేయడం ద్వారా సుస్థిరమైన అభివృద్ధిని సాధించగలమని ఎంపీడీఓ బీవీ రామకృష్ణ నాయక్ అన్నారు. సుస్థిరాభివృద్ధి సాధనకు మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, గ్రామ సచివాలయ సిబ్బందికి స్థానిక కమ్యూనిటీహాల్‌లో గురువారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోర్సు డైరెక్టర్‌గా హాజరైన ఎంపీడీఓ రామకృష్ణ నాయక్ మాట్లాడుతూ సుస్థిరాభివృద్ధికి ఐక్యరాజ్య సమితి నిర్దేశించిన తొమ్మిది అంశాలపై అధికారులు, ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించారు.

ఇంటర్న్‌షిప్‌పై శిక్షణ

మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఇంటర్న్‌షిప్‌పై శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ డి. వీరయ్య మాట్లాడుతూ ఇంటర్న్‌షిప్ అనేది విద్యార్థులకు విద్య, కెరీర్ మధ్య ఉన్న గ్యాప్‌ను తీర్చే ప్రధాన మార్గమన్నారు. టారస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తృతీయ సంవత్సరం సీఎస్ఈ విభాగాల్లో బ్లాక్ చైన్ టెక్నాలజీ, ఏఐ అండ్ ఎంఎల్, ఫుల్ స్టాక్ నాలుగో సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలకు దాతల విరాళం

తిరువూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సదుపాయాల కల్పనకు దాతలు గురువారం విరాళాలు అందజేశారు. వైష్ణవ బజారులో ట్యూషన్ పాయింట్ నిర్వహిస్తున్న మరింగంటి శేషు రూ.10 వేలు, జాబిల్లి హాస్పిటల్ వైద్యులు శ్రీనివాస బహద్దూర్ రూ.10 వేలు విరాళాన్ని విద్యార్థుల సైకిల్ షెడ్ నిర్మాణ నిమిత్తం అందజేశారని ప్రధానోపాధ్యాయిని శ్రీలక్ష్మి తెలిపారు.

భూ సమస్యలను పరిష్కరించుకోవాలి

చాట్రాయి: గ్రామాల్లో ఏమైనా భూ సమస్యలు ఉంటే రెవెన్యూ సదస్సులో అర్జీలు అందజేసి పరిష్కరించుకోవాలని తహసీల్దార్ డి. ప్రశాంతి కోరారు. గురువారం తుమ్మగూడెం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన బాల నరసింహారావు అనే రైతు 1.27 సెంట్లు అసైన్‌మెంట్ భూమికి పాస్ పుస్తకం ఇప్పించాలని అర్జీ అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మొలుగుమాటి మారెమ్మ, మండల ప్రత్యేకాధికారి వెంకటరత్నం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



తుమ్మగూడెంలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

ఆగిరిపల్లి: గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పీఎన్వీ ప్రసాద్ కోరారు. నూగొండపల్లిలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. పోతవరప్పాడుకు చెందిన చీకటి అనిరుధ్ రెవెన్యూ సదస్సులో కుల ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకోగా వెంటనే మంజూరు చేశారు. కార్యక్రమంలో రీ సర్వే డెప్యూటీ తహసీల్దార్ మరియన్న, ఆర్‌ఐ యూనస్, మండల సర్వేయర్ గంగరాజు పాల్గొన్నారు.

వేమిరెడ్డిపల్లి సదస్సుకు 20 అర్జీలు

విస్సన్నపేట: మండలంలోని వేమిరెడ్డిపల్లి గ్రామ సచివాలయం వద్ద గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 20 అర్జీలు వచ్చాయని మండల ప్రత్యేకాధికారి చక్రాణి తెలిపారు. పట్టాదార్ పాస్ పుస్తకాలకు అడంగల్‌కు సంబంధించి 15 అర్జీలు, ఇతరాలకు సంబంధించి ఐదు అర్జీలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పి. విజయకుమారి, సర్వే డీటీ విజయభాస్కర్, రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

● నూజివీడు: సుంకొల్లులో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో గ్రామస్తుల నుంచి 34 అర్జీలు అందాయని తహసీల్దార్ బీవీ సుబ్బారావు తెలిపారు. పట్టాదారు పాసు పుస్తకాల కోసం, భూములను సర్వే చేయించాలని, వేంకటేశ్వర స్వామి కోవెలకు చెందిన భూముల సమస్యను పరిష్కరించాలని అర్జీలు అందాయని చెప్పారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలంలోని నర్సపేటలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహిస్తామన్నారు.

గుర్తింపు ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్ విజయం

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): రైల్వే ట్రేడ్ యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ విజయం సాధించింది. గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాపులో ఈనెల 4, 5 తేదీల్లో జరిగిన సీక్రెట్ బ్యాలెట్ ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్‌కు 809 ఓట్లు పోల్ కాగా, సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్‌కు 757 ఓట్లు వచ్చాయి. 52 ఓట్ల మెజార్టీతో మజ్దూర్ యూనియన్ విజయం సాధించిందని కౌంటింగ్ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మజ్దూర్ యూనియన్ వర్క్‌షాప్ బ్రాంచ్ కార్యదర్శి ఎం.నాగేశ్వరరావు మాట్లాడుతూ రైల్వే గుర్తింపు ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్‌కు విజయం చేకూర్చిన కార్మికులు, ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా కార్మికులు ఆయనను అభినందించారు.



మాట్లాడుతున్న మజ్దూర్ యూనియన్ నాయకులు

సుంకర వీరభద్రరావు సేవలు చిరస్మరణీయం

తిరువూరు: పేదలకు అండగా నిలబడి ప్రభుత్వాన్ని నిలదీసిన కమ్యూనిస్టు యోధుడు సుంకర వీరభద్రరావు చిరస్మరణీయుడని సీపీఐ జిల్లా మాజీ కార్యవర్గ సభ్యుడు పసుపులేటి వెంకయ్య అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో గురువారం సుంకర వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పార్టీ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ సామాజిక చైతన్యానికి, రైతుల సంక్షేమానికి సుంకర చేసిన కృషి మరువలేనిదన్నారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు తూము కృష్ణయ్య, చిలుకూరి వెంకటేశ్వరరావు, మాలపాటి ఉదయ్, త్యాగరాజు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



సుంకర వీరభద్రరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్

పెనుగంచిప్రోలు: వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సీఐటీయూ అనుబంధ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక మునేరు అవతల మామిడి తోటలో గ్రామ, వార్డు వలంటీర్స్ యూనియన్ నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్లను విధుల్లోకి తీసుకోవడంతోపాటు వేతన బకాయిలు చెల్లించాలన్నారు. రూ.10 వేల వేతనం హామీని అమలు చేయాలని కోరారు. డిగ్రీ చదివిన వారు కూడా వలంటీర్లుగా కేవలం రూ. 5 వేల గౌరవ వేతనానికి పనిచేయటానికి సిద్ధపడ్డారంటే నిరుద్యోగ సమస్య ఏ స్థాయిలో ఉందో ప్రభుత్వం అర్థం చేసుకోవాలన్నారు. అనంతరం వలంటీర్ల మండల శాఖ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎం.శివగోపి, పూర్ణ, టి. అశోక్, కార్యదర్శిగా పి.త్రివేణి, సహాయ కార్యదర్శిగా జి.క్రాంతికుమారి, కోశాధికారిగా పి.భవానిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి దారా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చెత్త తొలగించారు



ఆగిరిపల్లిలో రోడ్లపై ఉన్న చెత్తను తొలగిస్తున్న పారిశుద్ధ్య కార్మికుడు

సాక్షి స్పందన

ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలో గత నాలుగు రోజులుగా రోడ్లపై పేరుకుపోయిన చెత్తను పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు. పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు చెల్లించకపోవడంతో వారు నాలుగు రోజుల నుంచి విధుల్లో పాల్గొనడం లేదు. దీంతో రోడ్లపై చెత్త పేరుకుపోయింది. దీనిపై బుధవారం 'సాక్షి'లో 'ఎక్కడి చెత్త అక్కడే' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి బొల్లినేని ప్రసాద్ గురువారం పారిశుద్ధ్య కార్మికులతో రోడ్లపై చెత్తను తొలగించారు. 15 మంది పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు చెల్లించారు. వారికి రావలసిన బకాయిలను నెల రోజుల్లోగా చెల్లిస్తామని హామీ ఇచ్చారు.

నేడు రైతుల సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం

మైలవరం: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు అన్నదాతకు అండగా కార్యక్రమం శుక్రవారం నిర్వహిస్తామని వైఎస్సార్ సీపీ మైలవరం పట్టణ అధ్యక్షుడు పాల నారాయణరెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా రైతు సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు మాదిగల ఆత్మీయ సభ

ఆగిరిపల్లి: నూజివీడులో శుక్రవారం జరుగనున్న మాదిగల ఆత్మీయ సభను విజయవంతం చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక సభ్యులు నల్లమోతు కాంచనరావు కోరారు. గురువారం ఆగిరిపల్లిలో ఆయన మాట్లాడారు. మాదిగల ఆత్మీయ సభకు ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ హాజరవుతారని చెప్పారు. ఎమ్మార్పీఎస్ నాయకులు కంబాల ప్రదీప్, బొబ్బర్ల సురేష్, మల్లంపల్లి రవి శేఖర్, పాల్గొన్నారు.

వాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించాలి



తిరువూరు: ద్విచక్ర వాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని తిరువూరు సెక్టార్‌-1 ఎస్ఐ సత్యనారాయణ అన్నారు. స్థానిక బోస్ సెంటర్లో గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. నిబంధనలు పాటించకుండా వాహనాలు నడుపుతున్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్ఐ మాట్లాడుతూ ప్రభుత్వాదేశాల మేరకు ఇకపై ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పలువురు మైనర్లు లైసెన్సు లేకుండా వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించి కేసులు నమోదు చేశారు.

రాజకీయ కక్షతో తొలగింపు తగదు

వత్సవాయి : మండల కేంద్రం వత్సవాయి జెడ్పీ పాఠశాల మధ్యాహ్న భోజన పథకం కార్మికులుగా 25 ఏళ్లుగా పనిచేస్తున్న వారిని కేవలం రాజకీయ కక్షతో తొలగించడం తగదని సీఐటీయూ మండల కార్యదర్శి బి.రాము విమర్శించారు. ఈ మేరకు సీఐటీయూ నాయకులతో కలిసి గురువారం ఆయన ఎంఈవో ఎల్.నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులను కొనసాగించాలని కోరారు. అనంతరం రాము మాట్లాడుతూ 25 ఏళ్లగా పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులుగా పని చేస్తున్న చంద్రగిరి లక్ష్మీనారాయణ, సరస్వతి, నరసమ్మ, చల్లా నాగమణిలను అకారణంగా తొలగించారని చెప్పారు. అధికారపార్టీ నాయకులు మా ప్రభుత్వం వచ్చింది. మీరు తప్పుకోండి మా వాళ్లను పెట్టుకుంటాం అని పేర్కొంటూ చివరికి అన్నంతపని చేశారన్నారు. విద్యాశాఖాధికారులు వెంటనే స్పందించి తొలగించినవారిని తిరిగి పనిలో పెట్టుకోవాలని కోరారు. లేకుంటే న్యాయపోరాటం చేస్తామన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు.



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న రాము తదితరులు

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని వినతి

వీరులపాడు: ఇళ్ల స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నందున తమకు నివేశన స్థలాలు మంజూరు చేయాలని తిమ్మాపురం గ్రామస్తులు, తహసీల్దార్‌ను కోరారు. మండలంలోని తిమ్మాపురంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఇళ్ల స్థలాలు ఇవ్వకపోవడంతో సొంతిల్లు లేక ఇబ్బందులు పడుతున్నామని 30 కుటుంబాలవారు తమ సమస్యలను తహసీల్దార్ హుస్సేన్‌కు వివరించారు. ఇళ్లస్థలాలను కేటాయించాలంటూ వినతిపత్రం అందజేశారు. అనంతరం తహసీల్దార్ స్పందిస్తూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ నాగరాజు, ఆర్‌ఐ సంధ్య, వీఆర్వో వెంకటేశ్వరరావు, రైతులు, గ్రామస్తులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



మద్యం సీసాలు పట్టివేత

ముసునూరు: మండలంలోని సింహాద్రిపురంలో గురువారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. మట్టా ధర్మారావు అనే వ్యక్తి నుంచి ఏడు మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, అతడిని అదుపులోకి తీసుకున్నట్లు నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు. దాడిలో ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు వై.ఈశ్వరరావు, ఎం.ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

నలుగురు నిందితుల బైండోవర్

మైలవరం: ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ మైలవరం పరిధిలో మద్యం కేసులో నలుగురు నిందితులను జి.కొండూరు తహసీల్దార్ ఎదుట గురువారం బైండోవర్ చేశామని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జె. శ్రీనివాస్ తెలిపారు. బైండోవర్ చేసిన వారిలో వేముల రమణ, వేమిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, గుత్తి శిరీష, షేక్ మాబు సుభాని ఉన్నారని చెప్పారు.

మహిళలకు శిక్షణ

గంపలగూడెం : స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో గరికపాడు కేవీకే ఆధ్వర్యంలో మహిళలకు హెర్బల్ పౌడర్ తయారీపై గురువారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ప్రభావతి మాట్లాడుతూ మహిళలు ఇళ్లకే పరిమితం కాకుండా విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కరివేపాకు పొడి, సుండి పిండి తదితర వాటికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. వీటి తయారీ, విక్రయాలతో మహిళలు ఆర్థికంగా అభివృద్ధిని సాధించవచ్చన్నారు. బ్యాంకుల్లో కూడా రుణాలు తీసుకుని కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబాలు బాగుంటాయని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ లూర్దుమేరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారద, మహిళలు పాల్గొన్నారు.